పదో తరగతి పరీక్షా పత్రాల వేలం

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు

షాబాద్, ఆగస్టు 19 : రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన 10వ తరగతి మార్చి, జూన్ 2022-23 ప్రభుత్వ పరీక్షా పత్రాలు ఫస్ట్, సెకండ్ సెట్ పత్రాలు వేలం వేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన జిల్లాలోని రద్దీ వ్యాపారులు రూ.10వేలు జిల్లా విద్యా శాఖ అధికారి, రంగారెడ్డిజిల్లా పేరున డిమాండ్ డ్రాఫ్టు తీసి వారివారి రేట్ల వివరాలతో పాటు సీల్డ్ కొటేషన్‌ను జిల్లా విద్యాశాఖ కార్యాలయం రంగారెడ్డిజిల్లా, ఐడీఓసీ కొంగరకలాన్ కార్యాలయంలో ఆగస్టు 22న ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటల లోపు సమర్పించాలని కోరారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు టెండర్స్ ఓపెన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వైద్య కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

రంగారెడ్డిజిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాబాద్, ఆగస్టు 19 : గౌరవ వేతనం ప్రాతిపదికన రంగారెడ్డిజిల్లా మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్(15), ట్యూటర్(1)ఎస్‌పీఎమ్ స్టాటిస్టిషియన్ పోస్టుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం శివరాంపల్లి, హైదరాబాద్, రంగారెడ్డిజిల్లాలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలు <www.rangareddy.telangana.gov.in>, DMETS, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడ్డాయన్నారు.

ఇద్దరు పోలీసులపై వేటు

పూడూరు,ఆగస్టు 19 : బీజేపీ అధ్యక్షుడు రాఘవేందర్‌పై దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరు పోలీసులు ఉన్నారనే నేపథ్యంలో ఉన్నతాధికారులు వేటు వేశారు. పూడూరు మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్‌పై ఈ నెల 16 శుక్రవారం తెల్లవారుజామున దాడి జరిగిన సమయంలో ఆనందం కారులో హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, హోంగార్డు ఆంజనేయులు ఉన్నారని బీజేపీ నాయకులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రైవేటు వాహనంలో పోలీసులు ఉన్నట్లు బాధితుడికి సంబంధించిన సీసీ పుటేజీలను కూడా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు సమర్పించారు. రాఘవేందర్ ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన అనంతరం వారు ఉన్నట్లు గుర్తించి వారిపై వేటు వేస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారని ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

హత్యాచారంపై ప్రజాగ్రహం

పలు చోట్ల నిరసన తెలిపిన వివిధ సంఘాల నాయకులు

పెద్దఅంబర్‌పేట : రావినారాయణరెడ్డి కాలనీలో నిరసన తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 19 : కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారంపై సీపీఐ అనుబంధ ప్రజా, యువజన, విద్యార్థి, మహిళా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సమీపంలోని రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3లో నిరసన తెలిపారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం బాధాకరమైన విషయమని, ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు, కౌన్సిలర్ లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, వివిధ సంఘాల నాయకులు ప్రసాద్, మధు, వినోద్, నవనీత, పుల్లయ్య, సైదులు, యాదగిరి, దేవమ్మ, అనసూయ, నాగరాజు, కవిత, సుభద్ర, వీరేశ్ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

షాబాద్ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం షాబాద్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేస్తున్న మహిళా డాక్టర్లపై ఇలాంటి దాడులు జరగడం దుర్మార్గమని మండిపడ్డారు. దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు రుక్కయ్య, శ్రీశైలం, ఉదయ్‌కిరణ్, రాములు, పాండు, రఘురాం, మధు, నారాయణ, నాగమణి, బాలమణి పాల్గొన్నారు.

షాబాద్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తదితరులు

మౌలానా రచించిన అరబిక్-తెలుగు నిఘంటువును హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అరబిక్-తెలుగు నిఘంటువు ఆవిష్కరణ

పరిగి, ఆగస్టు 19 : వికారాబాద్ జిల్లా దోమ మండలం దిర్సంపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ అబ్దుల్ రహీం మహమ్మద్ మౌలానా రచించిన అరబిక్-తెలుగు నిఘంటువును పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. 1200 పేజీలు గల అరబిక్-తెలుగు నిఘంటువును రాయడానికి మౌలానా 12 సంవత్సరాలపాటు రాత్రింబవళ్లు కష్టపడ్డారు.

డాక్టర్ అబ్దుల్ రహీం మహ్మద్ మౌలానాకు తెలుగు భాషపై ఉన్న అంకితభావం, సాహిత్యం అసమానమైనదని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఖురాన్‌ను తెలుగులోకి అనువదించడమే కాకుండా.. అతడి సాహిత్య రచనలు అరబిక్ నుంచి తెలుగులోకి అనువదించబడ్డాయని పేర్కొన్నారు. ఈ నిఘంటువు గల్ఫ్ దేశాల్లో లక్షలాది తెలుగు ప్రజలకు ఉపయోగపడుతుందని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ.. భాషా సాహిత్యం యొక్క వారసత్వాన్ని సంరక్షించడంలో నిరంతరం కృషిచేస్తానని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాలకు రూ.20 కోట్లు ఇవ్వండి

షాద్‌నగర్, ఆగస్టు 19 : షాద్‌నగర్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన చౌదరిగూడ, నందిగామ మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాలకు రూ. 20కోట్ల నిధులను విడుదల చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. మండల వాసుల ప్రయోజనాల దృష్ట్యా మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై సానుకులంగా స్పందించారని, త్వరలోనే నిధులను మంజూరు చేస్తామని మంత్రి తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అనుమానం పెనుభూతమై..

జూనియర్ ఆర్టిస్టు అనురాధను గొంతు నులిమి హత్య చేసిన భర్త

- ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లుగా చిత్రీకరణ
- కేసు నమోదు చేసిన షాద్‌నగర్ పోలీసులు

షాద్‌నగర్, ఆగస్టు 19 : భార్యపై ఆన్న అనుమానమే హత్యకు దారి తీసిన సంఘటన షాద్‌నగర్ మున్సిపాలిటీ మల్లికార్జున కాలనీలో సోమవారం జరిగింది. షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మల్లికార్జున కాలనీలో మద్దూరి అనురాధ(36), శివరామయ్య అనే దంపతులు తన కూతురు నందినితో కలిసి గత కొన్నాళ్లుగా నివాసం ఉంటున్నారు. అనురాధ గత కొన్నాళ్లుగా జూనియర్ అర్టిస్టుగా పనిచేసి ప్రస్తుతం ఇంటివద్దే ఉంటున్నది. అనురాధపై శివరామయ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయమై వారు తరచుగా గొడవపడుతుండేవారు. ఇందులో భాగంగానే సోమవారం ఉదయం అనురాధను భర్త శివరామయ్య గొంతు నులిమి హత్య చేసిన అనంతరం చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు చిత్రీకరించాడు. ఈ విషయాన్ని శివరామయ్య తన కూతురుకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. విషయం తెలుసుకున్న కూతురు నందిని కుటుంబ సభ్యులతో కలిసి ఫ్యాన్‌కు వేళ్లాడుతున్న అనురాధ మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించగా గొంతు నులిమి హత్య చేసిన ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ విజయ్‌కుమార్ జరిగిన ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు. తండ్రి శివరామయ్యనే తన తల్లిని హత్యచేశాడని కూతురు నందిని ఫిర్యాదు చేసినట్లు సీఐ వివరించారు. హత్యకు పాల్పడిన శివరామయ్య పరారీలో ఉన్నట్లు తెలిపారు. అనురాధ మృతదేహాన్ని షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించామని చెప్పారు. భార్యపై పెట్టుకున్న అనుమానమే హత్యకు దారితీసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

అనురాధ(ఫైల్)

మక్తవెంకటాపూర్‌లో బోనాల ఊరేగింపులో మహిళలు, పాల్గొన్న గ్రామ పెద్దలు, పోతురాజులు, శివసత్తులు

ఘనంగా బోనాలు

కులకచర్ల, ఆగస్టు 19 : చౌడాపూర్ మండల పరిధిలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో సోమవారం బంగారు మైసమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాల ఊరేగింపు కనులపండువగా జరిగింది. అనంతరం మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాందాస్ నాయక్, సీటీవో రాంచందర్, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీని సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేను పరిచయం చేశారు. - ఆమనగల్లు, ఆగస్టు 19

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

హయత్‌నగర్, ఆగస్టు 19 : ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ ఆటో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ హయత్‌నగర్ డిపో-1కు చెందిన బస్సు అనాజ్‌పూర్ నుంచి జేబీఎస్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలోని కోహెడ సమీపంలో వెళ్తుండగా పక్క నుంచి వచ్చిన ఓ ఆటో ఢీకొన్నది. ఆటో డ్రైవర్ జనార్దన్ (42) పైకి ఎగిరి ఆర్టీసీ బస్సు కింద పడటంతో పైనుంచి చక్రాలు వెళ్లాయి. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా కంపెనీకి భూములివ్వం

కలెక్టర్‌కు రైతుల వినతిపత్రం

బొంరాస్‌పేట, ఆగస్టు 19 : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచెర్లకుంటతండాల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు తమ భూములు ఇవ్వబోమని ఆయా గ్రామాల రైతులు సోమవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏండ్లుగా తాము భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు సాగు భూములను కంపెనీ కోసం ఇస్తే తాము ఎలా బతకాలని వారు అన్నారు. అదేవిధంగా ఫార్మా కంపెనీల ఏర్పాటుతో గ్రామాల్లో వాయు, నీటి కాలుష్యం ఏర్పడుతుందని దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని రైతులు కలెక్టర్‌కు వివరించారు. తమకు ప్రభుత్వం ఇచ్చే ఎలాంటి నష్ట పరిహారం అవసరం లేదని, బలవంతంగా భూములు సేకరించే ప్రయత్నాలను విరమించుకోవాలని రైతులు కలెక్టర్‌కు వివరించారు.



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దుద్యాల మండల రైతులు

ఫొటోలతో మధుర జ్ఞాపకాలు సజీవం

కడ్తాల్‌లో లూయిస్ డ్యాగురే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కడ్తాల్, ఆగస్టు 19 : జీవితంలో మధురమైన జ్ఞాపకాలు, దృశ్యాలు ఫొటోల్లో సజీవంగా ఉంటాయని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు నర్సింహ అన్నారు. సోమవారం తలకొండపల్లిలో మండల ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిజ్ డ్యాగురే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధురమైన క్షణాలను జ్ఞాపకంగా ఉంచుకోవడం ఫొటోలతోనే సాధ్యమని తెలిపారు. వంద మాటలతో చెప్పలేని భావాన్ని ఒక్క ఫొటోతో వెల్లడించవచ్చని, ఒక చిత్రరూపాన్ని ఫొటోగ్రఫీగా మార్చి సమాజంలో చైతన్యం తీసుకురావొచ్చని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రఫర్ల సంఘం ఉపాధ్యక్షుడు మధు, ప్రధాన కార్యదర్శి మహేశ్, కోశాధికారులు రమేశ్, విజయ్, గౌరవ సభ్యులు శేఖర్, శ్రీను, రఫూఫ్, శ్రీకాంత్, చరణ్, తరుణ్, వేణు, గిరి, సాయి, మహేశ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పెయింటింగ్ ఎగ్జిబిషన్

కొండాపూర్, ఆగస్టు 19 : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సోమవారం 'ది షిఫ్టింగ్ ల్యాండ్ స్కేప్ ఆఫ్ తెలంగాణ' పేరిట పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలోని చిత్రాలను ఆర్కియాలజీ డైరెక్టర్ భారతి హోలీకేరీ, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, టూరిజం డైరెక్టర్ త్రిపాటి, భాషా సంస్కృతి విభాగాల డైరెక్టర్ మామిడి హరికృష్ణతో కలిసి తిలకించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో 20 మంది తెలంగాణ, 15 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు గీసిన 70 చిత్రాలను ప్రదర్శించారు. కాగా, ఈ ప్రదర్శన ఆగస్టు 25వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రదర్శనలోని చిత్రాలను తిలకిస్తున్న ప్రముఖులు

ఏఈ రమేశ్ సస్పెండ్

మియాపూర్, ఆగస్టు 19 : శేరిలింగంపల్లి జోనల్ ఎస్ఈ శంకర్‌తో దురుసుగా ప్రవర్తించిన ఏఈ ఆర్.రమేశ్‌పై సస్పెండ్ వేటు పడింది. ఈమేరకు ఏఈని సస్పెండ్ చేస్తూ బల్దియా కమిషనర్ ఆమ్రపాలి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పది రోజుల కిందట శేరిలింగంపల్లి సర్కిల్‌లో ఏఈగా పని చేస్తున్న రమేశ్ ఓ సమావేశంలో తనపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు తన ఛాంబర్‌లో పలువురు అధికారుల ఎదుట దాడికి పాల్పడ్డాడని పేర్కొంటూ ఎస్ఈ శంకర్ గచ్చిబౌలి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎస్ఈ తనపై దాడికి పాల్పడ్డారంటూ ఏఈ రమేశ్ సైతం గచ్చిబౌలి ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం బల్దియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై శాఖాపరమైన విచారణను చేపట్టి, ఎస్ఈ శంకర్ పట్ల ఏఈ రమేశ్ దురుసుగా ప్రవర్తించినట్లు నిర్ధారించారు. ఏఈని సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు రమేశ్‌ను తన మాతృ సంస్థ అయిన టీజీహెచ్‌సీఎల్‌కు సరెండర్ చేశారు.

మాల్‌లో ట్రా'ఫికర్'

- మంగళవారం వస్తే పరేషాన్
- ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికుల అవస్థలు
- ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

యాచారం, ఆగస్టు 19 : మండలంలోని మాల్ మార్కెట్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య రెట్టింపవుతున్నది. సాగర్ రహదారిపై ప్రైవేటు వాహనదారులు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నవి. ముఖ్యంగా మంగళవారం వచ్చిందటే చాలు.. వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు నరకం చూడాల్సిందే.. మంగళవారం మాల్‌లో సంత నిర్వహించడంతో రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారుల దందా, ఇష్టారాజ్యంగా ఆటోలు, క్రూజర్లు, బైకులు నిలపడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతున్నది. ఒక్కోసారి మర్రిగూడ వెళ్లే రోడ్డులో ఏకంగా పది నుంచి ఇరవై నిమిషాల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. అసలే రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల సరిహద్దు ప్రాంతం కావడం, అటు యాచారం.. ఇటు చింతపల్లి మండలాల్లో మాల్ విస్తరించి ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు, ప్రజలతో రోడ్డంతా కిక్కిరిసిపోతున్నది.

ఇటీవల సాగర్-హైదరాబాద్ రహదారికి వాహనాల తాకిడి మరింత పెరిగింది. సాగర్ గేట్లు ఎత్తడం, ఎత్తిపోతల జలపాతం దూకడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. పైగా పెండ్లిళ్ల సీజన్ కావడంతో రద్దీ మరింత పెరిగింది. హైదరాబాద్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు ప్రజలు రాకపోకలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతున్నది. మాల్ చౌరస్తా వద్ద సాగర్ రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్నది. అక్కడే మర్రిగూడ, మంథన్‌గౌరెల్లి లింకురోడ్డు ఉండటంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. రోడ్డుపక్కనే కూరగాయల మార్కెట్లు ఉండటంతో పాడైన కూరగాయలను వ్యాపారులు రోడ్డుపైన పడేయడంతో అవి తినడానికి పదుల సంఖ్యలో మేకలు రావడంతో ట్రాఫిక్ సమస్యలు మరింతగా పెరుగుతున్నాయి. వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆ రోడ్డులో కనీసం ద్విచక్రవాహనం నడపాలన్నా నరకం చవిచూడవల్సిందేమరి. వాహనాలు కాదు కదా ఒక్కోసారి కనీసం కాలినడకన నడవలేని దుస్థితి నెలకొంటుంది. అక్రమ పార్కింగ్‌లపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని, వాహనాల రాకపోకల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాల్‌లో ట్రాఫిక్‌జామ్‌తో సాగర్ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

మాల్‌లో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ పెరిగిపోతున్నది. సాగర్ రోడ్డు దాటాలంటే ప్రజలు జంకుతున్నారు. వాహనదారులు సంత రోజు ప్రాణాలరచేతిలో పెట్టుకొని వాహనాలను నడుపుతున్నారు. ప్రైవేటు వాహనదారులు రోడ్డుకిరువైపులా అక్రమంగా పార్కింగ్ చేయడంతోనే ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. చిరు వ్యాపారులు సైతం రోడ్డు కిరువైపులా వ్యాపారం చేసుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. పోలీసులు, అధికారులు తగిన చర్యలు తీసుకొని మాల్ మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

- పోలెపల్లి వినోద్‌కుమార్, ధనుంజయ దవాఖాన ఎండీ, మాల్

ట్రాఫిక్ సమస్య నివారణకు కృషి

మాల్ మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ప్రైవేటు వాహనాలైన క్రూజర్లు, ఆటోలు రోడ్డుపై నిలుపకుండా చూస్తాం. కూరగాయల వ్యాపారులపై తగిన చర్యలు తీసుకుంటాం. చిరువ్యాపారులు రోడ్డు పక్కన కాకుండా దూరంగా ఉండి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలి. రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేసే ద్విచక్ర వాహనాలు, ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తాం.

- శంకర్‌కుమార్, సీఐ, యాచారం